సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.23 ప్రకారం ధర పలికింది.



ప్రాణం తీసిన ఓవర్‌టేక్

ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయిన కారు... ఆటోను ఢీ కొంది. ఈ ఘటనలో ఒక మహిళ మృతి చెందింది. మరో 15 మంది గాయపడ్డారు.

8లో

గరిష్టం/కనిష్టం
34.2°/ 18.7°

జిల్లాలో శనివారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

భక్తిలో తరించి.. శోకం మిగిల్చి!



లారీ కిందకు దూసుకెళ్లిన కారును జేసీబీతో బయటకు తీస్తున్న దృశ్యం



మృతులు శ్రీనివాస్, షణ్ముఖ, వెంకటేష్, సంతోష్‌కుమార్, లక్ష్మీప్రసన్నకుమార్ రెడ్డి, ప్రణవ్‌సాయిరెడ్డి



హే భగవాన్..!

- కృష్ణ భక్తుల విషాద 'గీత'ం
- నాయనపల్లి క్రాస్ వద్ద కారు, లారీ ఢీ
- ఇస్కాన్‌లో సేవ చేస్తున్న ఆరుగురి మృత్యువాత
- సంకీర్తనకు వెళ్లి వస్తుండగా ఘోరం
- గుండెలవిసేలా రోదించిన కుటుంబీకులు, బంధువులు



సంఘటన స్థలంలో మృతదేహాలపై పడి విలపిస్తున్న బంధువులు



సర్వజనాస్పత్రి మార్చురీ వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

అనంతపురం/శింగనమల : వారంతా వయసులో చిన్నవారే... కానీ భక్తిలో మాత్రం వారికి ఎవరూ సరిలేరు. కృష్ణ భగవానుని సేవకు తమ జీవితాన్ని అంకితం చేశారు. స్వామిని కీర్తిస్తూ నిత్యం ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయేవారు. అలా కృష్ణ భగవానుడి కీర్తనలో పాల్గొని తిరిగివస్తున్న ఆ భక్తులను ఊహించని రోడ్డు ప్రమాదం కబళించేసింది. కుటుంబీకులు, ఆత్మబంధువులు, శిష్యులు అందరికీ తీరని శోకం మిగిల్చింది. శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అనంతపురం ఇస్కాన్ సేవకులు ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. అనంతపురంలోని ఇస్కాన్ మందిరంలో నగరానికి చెందిన మాదాలం సంతోష్ కుమార్ (34), గల్లి వెంకటేష్ (24), యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్‌రెడ్డి (34), కర్ల ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి (13), శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం హరియాన్ చెరువుకు చెందిన బొలగొండ శ్రీనివాస్ అలియాస్ శ్రీధర్ (26), శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహడపల్లికి చెందిన బొట్ట షణ్ముఖ (30) పనిచేస్తున్నారు. శనివారం ఉదయం వీరంతా తాడిపత్రి పట్టణంలోని శ్రీవాణి స్కూల్‌లో 'దామోదరం' అనే కార్యక్రమం నిర్వహించడానికి అనంతపురం నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని అదే కారులో అనంతపురానికి తిరుగు పయనమయ్యారు. నాయనపల్లి క్రాస్ సమీపంలోకి రాగానే కారు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘోర ప్రమాదంలో కారులోని ఆరుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి.

మిన్నంటిన ఆర్తనాదాలు..

ప్రమాద వార్తను తెలుసుకున్న వెంటనే కుటుంబీకులు హుటాహుటిన సంఘటనాస్థలానికి తరలి వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తమ వారిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారన్న వార్త తెలుసుకున్న ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తండ్రి దూరమై దుఃఖంలో ఉన్న వారి బిడ్డలు.. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబీకులు.. ఆప్తమిత్రుడు దూరమై ఆత్మబంధువులు.. గురువును కోల్పోయి శిష్యులు చేసిన రోదనలతో అనంతపురం సర్వజనాస్పత్రి దద్దరిల్లింది. ఒక కుటుంబ సభ్యుడు షాక్‌కు లోనై అక్కడే స్పృహ కోల్పోయాడు.

డ్రైవర్ నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదం..

కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా కారు నడపడంతోనే రోడ్డు ప్రమాదం జరిగిందని మృతుడు మాదాలం సంతోష్ కుమార్ తండ్రి మాదాలం గంగాధర్ ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రమాదం జరిగిన సమయంలో లక్ష్మీ ప్రసన్నకుమార్‌రెడ్డి డ్రైవింగ్ చేస్తున్నట్లు తెలిసిది.

నేడు పోస్టుమార్టం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురి మృతదేహాలను ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. ఆదివారం ఉదయం 8 గంటలకల్లా పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

పార్ట్ టైం జాబ్ చేస్తూనే..

శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పహడపల్లికి చెందిన బొట్టు సాంబమూర్తి కుమారుడు షణ్ముఖ అనంతపురంలో బీటెక్ పూర్తి చేశాడు. విద్యను అభ్యసించడానికి ఇక్కడికి వచ్చిన షణ్ముఖ.. కోర్సు పూర్తి చేసిన అనంతరం ఇస్కాన్ బోధనల వైపు ఆకర్షితుడయ్యాడు. ఇస్కాన్ మందిరంలోనే సేవలు చేసుకుంటూ నగరంలోనే ఉండిపోయాడు. నిత్యం ఇస్కాన్ మందిరంలో పూజలు చేసిన తర్వాత పార్ట్‌టైం ఉద్యోగానికి వెళ్లేవాడు. ఇస్కాన్‌లోనే ఉంటూ సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధం అవుతున్నాడు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. కుమారుడి మరణవార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు స్వగ్రామం పహడపల్లి నుంచి అనంతపురం బయలుదేరినట్లు తెలిసింది.

పెళ్లి చేయాలనుకుంటుండగా..

అనంతపురం శివారు నాగిరెడ్డిపల్లికి చెందిన వై. శివశంకర్ రెడ్డి, కృష్ణవేణి మాతాజీ దంపతుల కుమారుడు యాగంటి లక్ష్మీ ప్రసన్న కుమార్ రెడ్డి బీటెక్ పూర్తి చేశాడు. నాలుగు సంవత్సరాలుగా ఇస్కాన్‌లో సేవలు చేస్తున్నాడు. చిన్నప్పటి నుంచి భక్తిభావంతో ఇస్కాన్‌లో భజనల్లో పాల్గొనేవాడు. ప్రసన్నకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు అనుకుంటున్న సమయంలోనే దారుణం జరిగింది. నాగిరెడ్డిపల్లిలో అనురాగం, ఆప్యాయతకు ప్రసన్నకుమార్ రెడ్డి పెట్టింది పేరు. అలాంటి వ్యక్తి మరణించాడని తెలియడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో సర్వజనాస్పత్రికి తరలివచ్చారు. ప్రసన్న మంచితనాన్ని గుర్తు చేసుకుని కన్నీరు పెట్టుకున్నారు.

నాన్నా లే...

ప్రమాదంలో మరణించిన మాదాలం సంతోష్ కుమార్‌కు నాలుగు సంవత్సరాల క్రితం ప్రియాంకతో పెళ్లయింది. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఈ క్రమంలో తండ్రి మృతదేహం వద్ద చిన్నారి పడిన వేదన అందరినీ కన్నీరు పెట్టించింది. 'నాన్నా లే' అంటూ ఏడుస్తున్న చిన్నారిని ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు. తమ ఒక్కగానొక్క కుమారుడు మరణించడంతో సంతోష కుమార్ తల్లిదండ్రులు కూడా కన్నీరు మున్నీరయ్యారు. 'మమ్మల్ని వదిలి వెళ్లి పోయావా తండ్రీ' అంటూ గుండెలవిసేలా రోదించారు.

వెంకీ రా నాన్నా..

చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మికత మెండుగా ఉన్న గల్లి వెంకటేశ్ అలియాస్ వెంకీ 10 ఏళ్లుగా ఇస్కాన్‌లో సేవలు చేస్తున్నాడు. అనంతపురం నగరంలోని కమలానగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు, నాగజ్యోతి దంపతుల రెండో కుమారుడు వెంకీ. తల్లిదండ్రులు ఇస్కాన్ భావాలను నమ్మి అందరినీ సన్మార్గం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వెంకటేశ్ అకస్మాత్తుగా దూరం కావడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపో తున్నారు. 'వెంకీ రా నాన్నా' అంటూ కుమారుడి మృతదేహం వద్ద శ్రీనివాసులు పడిన వేదన వర్ణనాతీతంగా మారింది.

చిన్న వయసులోనే అందనంత దూరంగా..

అనంతపురం గాంధీ బజార్‌కు చెందిన పెద్దారెడ్డి, మాతాజీ దంపతుల కుమారుడు కర్ల ప్రణీత్ ప్రణవ్ సాయి రెడ్డి హైదరాబాద్‌లోని స్వామి నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల్లో అనంతపురం వచ్చాడు. చిన్నప్పటి నుంచి ఆధ్యాత్మిక భావజాలం అధికంగా ఉండే ప్రణవ్ తాడిపత్రిలో సంకీర్తన కార్యక్రమం ఉందని ఇస్కాన్ బృందంతో పాటు వెళ్లాడు. కేవలం 13 సంవత్సరాల వయస్సు గల బిడ్డ అందనంత దూరం కావడంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

తలలో నాలుక శ్రీధర్

బొలగొండ శ్రీనివాస్ అలియాస్ శ్రీధర్‌ది శ్రీసత్యసాయి జిల్లా సీకేపల్లి మండలం హరియాన్ చెరువు. వీరి కుటుంబం 20 సంవత్సరాల నుంచి అనంతపురం హౌసింగ్‌బోర్డులో ఉంటోంది. ఈ క్రమంలో శ్రీధర్ ఇస్కాన్ మందిరంలో గోశాల సంరక్షకుడిగా ఉంటూ అందరికీ తలలో నాలుకలో ఉండేవాడు. శ్రీధర్ స్వయానా పూజారి. భార్య దివ్య మాత. వీరి కుమారుడు కృష్ణకు ఐదు సంవత్సరాలు. అందరికీ సాయం చేసే గుణం ఉన్న వ్యక్తి. ఇస్కాన్‌లో ఎంతో మంది శిష్యుల్ని తయారు చేశాడు. సంకీర్తనలో దిట్ట. అలాంటి మనిషి దూరం కావడంతో శిష్యులు తల్లడిల్లిపోయారు. ఆత్మబంధువుకు కన్నీటి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

వెనిజులా ఉపాధ్యక్షురాలికి ఘన స్వాగతం



వెనిజులా ఉపాధ్యక్షురాలితో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్

పుట్టపర్తి టౌన్: సత్యసాయి మహా సమాధి దర్శనార్థం శనివారం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్న వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌కు ఘన స్వాగతం లభించింది. 13 మంది బృందం సభ్యులతో కలిసి పుట్టపర్తికి విచ్చేసిన ఆమెకు విమానాశ్రయంలో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్, ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్‌లు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. సాయంత్రం ఆమె సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్: అనంతపురం జిల్లా శింగనమల మండలం నాయనిపల్లి క్రాస్ వద్ద కారు, లారీ ఢీ కొన్న ప్రమాద ఘటనపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరుగురు మృతి చెందటం తనను కలచి వేసిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆమె కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన డీఈఓ బాధ్యతల స్వీకరణ



నూతన డీఈఓ కిష్టప్పకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పుట్టపర్తి: నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా కిష్టప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు డీవైఈఓగా పని చేస్తున్న ఆయన్ను ప్రభుత్వం...రెండు రోజుల కిందటే జిల్లా విద్యాశాఖ అధికారిగా బదిలీ చేసింది. దీంతో శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంఈఓ–2 జయచంద్ర, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు నాగరాజు సిబ్బంది డీఈఓకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో స్కిల్ సెన్సెస్ సర్వే

ప్రశాంతి నిలయం: స్కిల్ సెన్సెస్ సర్వే నవంబర్ మొదటి వారంలో జిల్లా వ్యాప్తంగా చేయనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఇందుకు సచివాలయ సిబ్బంది సహకరించాలన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వేలో పాల్గొనే వారికి ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సర్వేలో భాగంగా 15– 59 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారి నుంచి పూర్తి వివరాలు సేకరిస్తారన్నారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు తమ విద్యార్హత, నైపుణ్యానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచుకుంటే సర్వే త్వరగా పూర్తి చేసేందుకు వీలు కలుగుతుందన్నారు.

పంటల బీమాపై అవగాహన కల్పించాలి

పుట్టపర్తి అర్బన్: పంట బీమాపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు (డీఏఓ) అధికారులను ఆదేశించారు. శనివారం డీఏఓ, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, సీపీఓ విజయ్‌కుమార్, బీమా కంపెనీ ప్రతినిధులతో కలిసి మండల స్థాయి వ్యవసాయాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ, ఈ రబీ నుంచి 2019కి ముందు అమలు చేసిన బీమా అమలవుతుందని, ప్రీమియం మొత్తం రైతులే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వరి పంటకు డిసెంబర్ నెలాఖరుకు, వేరుశనగ, టమాటకు డిసెంబర్ 15వ తేదీలోపు బీమా చేయించాలన్నారు. వరికి ఎకరాకు రూ.630, వేరుశనగకు రూ.480, టమాటకు రూ.1,600 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

సత్యసాయి విద్యావిధానం దేశానికే ఆదర్శం



జ్యోతి ప్రజ్వలనతో సత్యసాయి విద్యాసంస్థల జాతీయ కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: ఆధునిక సమాజంలో చోటు చేసుకున్న లోపాలను సరిదిద్దేలా రూపొందించిన సత్యసాయి విద్యా విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు అన్నారు. రెండురోజుల పాటు నిర్వహించే సత్యసాయి విద్యాసంస్థల ఏడో జాతీయ కన్వెన్షన్ శనివారం ఉదయం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి జ్యోతి ప్రజ్వలనతో జాతీయ కన్వెన్షన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యసాయి విద్యాసంస్థల సిబ్బంది సత్యసాయి సూక్తులున్న ప్లకార్డులు ప్రదర్శిస్తూ యజుర్ మందిరం నుంచి ర్యాలీగా సాయికుల్వంత్ సభా మందిరానికి విచ్చేశారు. అనంతరం సత్యసాయి బోధనలను అనుసరిస్తూ సత్యసాయి విద్యాసంస్థలను బలోపేతం చేయడం అన్న అంశంపై చర్చించారు. ఆర్‌జే రత్నాకర్ రాజు మాట్లాడుతూ, సత్యసాయి విద్యా విధానం ఎంతో గొప్పదన్నారు. సత్యసాయి బోధనలను, ఆయన ఆదర్శాలను అనుసరిస్తూ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సత్యసాయిబాబా దేశ వ్యాప్తంగా విద్యాసంస్థలు నెలకొల్పి సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేశారని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ నిమీష్ పాండే అన్నారు. అనంతరం సత్యసాయి విద్యాసంస్థల సిబ్బంది సంగీత విభావరి నిర్వహించారు.

పని చేయకపోతే పంపించేస్తా

- సాయంత్రం 4 గంటల వరకూ వైద్యులు విధుల్లో ఉండాల్సిందే
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ చేతన్



ఎంసీహెచ్ వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్

హిందూపురం టౌన్: 'జిల్లా ఆస్పత్రిలో పనిచేసే వైద్యులంతా సాయంత్రం 4 గంటల వరకూ విధుల్లో ఉండాల్సిందే. ఇక నుంచి రెఫర్ చేసి తప్పించుకుంటామంటే కుదరదు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందాలి. ఇందులో రాజీపడే ప్రసక్తే లేదు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఇంటికైనా పంపుతాం' అని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శనివారం కలెక్టర్ చేతన్ అధ్యక్షతన హిందూపురంలోని జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు ఆస్పత్రిలోని ప్రతి వార్డునూ ప్రతిరోజు పరిశీలించాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం ప్రతి రెండు నెలలకోసారి నాలుగో శుక్రవారం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలు, స్పెషలిస్ట్ డాక్టర్లు ద్వారా ఇంకా మెరుగ్గా రోగులకు సేవలందించాలని, తద్వారా వచ్చిన ఫండ్స్‌ను హాస్పిటల్ అభివృద్ధికి వెచ్చించాలని సూచించారు. అత్యవసర విభాగంలోని వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఓపీ, ఐపీ సేవలు మెరుగుపరచాలని, చిన్న చిన్న జబ్బులకూ రెఫర్ చేయడం తగ్గించుకోవాలన్నారు. ఆస్పత్రిలో ఫీడింగ్ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డుమ్మా వైద్యులపై నివేదిక ఇవ్వండి..

కొందరు వైద్యులు విధులకు హాజరుకాకున్నా జీతం తీసుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయని, దీనిపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని డీసీహెచ్‌ఎస్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ ఎంసీహెచ్ వార్డును పరిశీలించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్ర నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్న, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఆర్ఎంఓ డేవిడ్ రాజ్, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు కుటుంబానికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఉద్యోగులు

అనంతపురం టౌన్: శ్రీసత్యసాయి జిల్లా బుక్క పట్నం సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు నాయక్ ఇటీవల చెన్నైలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో సబ్ రిజిస్ట్రార్ల సంఘం నాయకుడు షామీర్ నేతృత్వంలో ఉమ్మడి జిల్లా సబ్ రిజిస్ట్రార్లు తోటి సబ్‌రిజిస్ట్రరార్ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. వారంతా రూ.3లక్షల ఆర్థికసాయాన్ని శనివారం అనంతపురంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ విజయలక్ష్మి, డీఆర్ భార్గవ్ చేతుల మీదుగా మృతుని భార్య సుజాతకు అందించారు. త్వరలో సుజాతకు కారుణ్య నియామకం కింద రిజిస్ట్రేషన్ శాఖలో ఉద్యోగం కల్పించనున్నట్లు రిజిస్ట్రార్ల సంఘం జిల్లా నాయకుడు షామీర్ తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్లు రమణరావు, శ్రీరాములు, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో చోరీ



పొలంలో పడేసిన హుండీ

గోరంట్ల: గుంతపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ముఖద్వారం తలుపుల తాళం పగులగొట్టి దుండగులు ఆలయంలోకి ప్రవేశించి, హుండీని ఎత్తుకెళ్లారు. సమీ పొలంలో హుండీని పగులగొట్టి అందులోని సొమ్మును తస్కరించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాబు సిబ్బందితో అక్కడికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు.

వజ్రకరూరులో విషాదం

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో విషాదం చోటు చేసుకుంది. పది రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు మృతి చెందడం అందరినీ కలచివేసింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 13న వజ్రకరూరుకు చెందిన వేములనాయుడు(39), కుమారుడు సురేంద్ర(13)తో కలిసి ద్విచక్ర వాహనంపై గుంతకల్లు నుంచి ఇంటికి వస్తుండగా కమలపాడు వద్ద కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన తండ్రీకొడుకును ప్రైవేట్ వాహనంలో గుంతకల్లు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. ఈ నెల 17న కుమారుడు వేముల సురేంద్ర చనిపోయాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వేములనాయుడు శనివారం సాయంత్రం మృతి చెందాడు. భార్య పూర్ణిమ భర్త మృతదేహంపై పడి 'దేవుడా ఎందుకు ఇంత పనిచేశావు' అంటూ గుండెలవిసేలా పూర్ణిమ రోదించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిలోనే పాముల పుట్టలు

పొలం గట్లపై పాముల పుట్టలు ఉంటేనే అటుగా వెళ్లేందుకు జనం జంకుతారు. వాటికి దూరంగా నడుస్తుంటారు. అలాంటిది కుటుంబ సభ్యులంతా కలసి ఏకంగా తమ ఇంట్లోనే పాము పుట్ట మధ్య బతికేస్తున్నారు. అంతేకాక నిత్యం పుట్టకు పూజలు చేస్తున్నారు. చుట్టుపక్కల వారు పూజించుకునేందుకూ అవకాశం కల్పిస్తున్నారు. అరుదైన ఈ పుట్టలను చూడాలంటే మడకశిర మండలంలోని గ్రామాలను చుట్టి రావాల్సిందే.

- పుట్టల మధ్యే నివాసం
- ప్రజల్లో పెరిగిన భక్తి భావాలు
- ఉపవాస దీక్షతో పూజలు చేస్తున్న ముస్లిం మహిళ
- చుట్టుపక్కల వారికి కనిపిస్తున్న నాగుపాము





నాగుల పుట్టకు పూజలు చేస్తున్న జరీనా, హరేసముద్రంలో మైలారప్ప ఇంటి ఆవరణలో ఉన్న నాగుల పుట్ట

మడకశిర రూరల్: మడకశిర మండలం హరేసముద్రనం బీసీ కాలనీలో నివాసముంటున్న మైలారప్ప ఇంటి ఆవరణలో 20 ఏళ్ల క్రితం చిన్న పుట్ట వెలిసింది. ఇంటి నిర్మాణ సమయంలో పురోహితులను అడిగితే అంతా మంచే జరుగుతుందని, పుట్టను తొలగించరాదన్నారు. దీంతో కట్టడం మొదలు పెట్టిన తర్వాత ఇంటి ప్రధాన ద్వారం నాగుల పుట్టకు ఆనుకుంది. రోజురోజుకూ పుట్ట పెరుగుతూ ప్రస్తుతం ఆరు అడుగుల ఎత్తుకు చేరుకుంది. ఈ పుట్టకు మైలారప్ప కుటుంబసభ్యులతో పాటు గ్రామస్తులూ రోజూ పూజలు చేస్తుంటారు. పుట్టలో పాలుపోస్తారు. దీంతో అతడి ఇల్లు నిత్యం సందడిగా ఉంటుంది. ఇంటి నుంచి బయటకు వెళ్లినా, ఏ కార్యం జరగాలన్నా ముందుగా పుట్టకు పూజలు చేసే వెళ్తారు. దీంతో వర్షానికి పుట్ట తడవకుండా దానిపై రేకుల షెడ్డు వేయించారు.

ముస్లిం మహిళ ఇంట పుట్ట..

మడకశిర మండలం అయ్యవారిపల్లిలో నివాసముంటున్న ముస్లిం మహిళ జరీనా ఇంట్లోనూ ఓ పుట్ట ఉంది. ప్రతి సోమవారం ఉపవాస దీక్షతో గత 20 ఏళ్లకు పైగా పుట్టను ఆమె భక్తి శ్రద్ధలతో పూజించుకుంటోంది. మంగళవారం ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు వచ్చి పూజలు చేయించుకుని వెళుతుంటారు. శుక్రవారం ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు వచ్చి పూజలు చేయించుకుంటారు. 50 ఏళ్ల క్రితం అయ్యవారిపల్లికి వచ్చిన జరీనా తండ్రి పీరాసాహెబ్‌కు గ్రామ ప్రజలు అప్పట్లో చోటు కల్పించి స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో నిర్మించిన గుడిసెలోపల తొలుత చిన్నగా పుట్ట పెరిగింది. తొలుత పుట్టను తొలగించాలని అనుకున్నా.. అది సాధ్యం కాలేదు. దీంతో పీరాసాహెబ్ గుడిసెను తొలగించి ఓ రేకుల షెడ్‌ను వేసుకున్నాడు. షెడ్ లోపలే పుట్ట పెరుగుతూ వచ్చి ప్రస్తుతం 12 అడుగులకు పైగా చేరుకుంది. ఉదయం వేళల్లో ఇంట్లోని పుట్ట నుంచి బయటకు వచ్చిన నాగుపాము... సమీప పొలాల్లోకి వెళ్లి రాత్రికి తిరిగి పుట్టకు చేరుకుంటోందని జరీనా కుటుంబ సభ్యులు తెలిపారు. లేదంటే ఇంట్లోనే ఏదైనా ఓ స్థలంలో ముడి వేసుకుని ఉంటుందని చెబుతున్నారు. పాము ఎదురైనా నెమ్మదిగా వెళ్లిపోతుందని, ఎవ్వరికీ హాని తలపెట్టదని చుట్టుపక్కల వారు అంటున్నారు.

మాంసాహారం మానేశాం



ఇంట్లో పుట్ట ఉన్నందున మేం ఎవ్వరూ మాంసాహారం ముట్టం. ప్రతి సోమవారం ఉపవాస దీక్షతో హిందూ సంప్రదాయాలను అనుసరించి పుట్టకు పూజలు చేస్తుంటాం. శుక్రవారం పెద్ద సంఖ్యలో ముస్లింలు వచ్చి పూజలు చేయించుకుని వెళుతుంటారు. పుట్టలో నాగు పాము కూడా ఉంది. రోజూ పూజలు చేసి, ఓ గిన్నెలో పాలు పోసి పెట్టిన కొద్ది సేపటికి నాగుపాము వచ్చి తాగి వెళుతుంటుంది. మాకంతా మంచే జరుగుతోంది.

– జరీనా, అయ్యవారిపల్లి, మడకశిర మండలం

చాలా మంది పుట్టను దర్శిస్తుంటారు



మా ఊళ్లో ముస్లిం మహిళ జరీనా ఇంట్లో వెలిసిన నాగుల పుట్టను దర్శించుకుని పూజలు చేయించుకునేందుకు రోజూ చాలా మంది వస్తుంటారు. అక్కడంతా హిందూ సంప్రదాయరీతిలోనే జరీనా పూజలు చేస్తుంటారు. ఆ పుట్టను దర్శించుకుని పూజిస్తే ఎలాంటి ఇబ్బందులైనా దూరమవుతాయని గ్రామస్తుల నమ్మకం. దీంతో గ్రామాల ప్రజలు కూడా వచ్చి పూజలు చేయించి వెళుతుంటారు.

– నాగమ్మ, అయ్యవారిపల్లి, మడకశిర మండలం

అంతా మంచి జరుగుతోంది



మా ఇంటి తలుపునకు ఆనుకుని వెలిసిన నాగుల పుట్ట ద్వారా అంతా మంచి జరుగుతోంది. ఇప్పటి వరకూ ఎలాంటి ఇబ్బందులూ లేవు. రోజూ ఉదయం నిద్ర లేవగానే మా కుటుంబ సభ్యులు పుట్టను చూసి, మొక్కుకున్న తర్వాతనే ఇతర దైనందిన కార్యక్రమాలు చేపడుతుంటాం. పురోహితులు చెప్పిన విధంగా నడుచుకుంటున్నాం.

– అడివక్క, హరేసముద్రం, మడకశిర మండలం

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



అనంతపురం, ప్రకాశం జట్ల మధ్య సాగుతున్న పోరు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బాల, బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ కం సెలెక్షన్‌లో భాగంగా రెండో రోజు శనివారం క్వార్టర్ ఫైనల్స్ జరిగాయి. తొలి మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. రెండవ మ్యాచ్ నెల్లూరు, శ్రీకాకుళం జట్ల మధ్య జరిగింది. ఫలితం తేలకపోవడంతో పెనాల్టీ షూట్ అవుట్లో 4–3 తేడాతో శ్రీకాకుళం విజయం సాధించి సెమీఫైనల్స్ అర్హత సాధించింది. అనంతపురం, ఈస్ట్ గోదావరి మధ్య జరిగిన మూడవ మ్యాచ్‌లో అనంతపురం 4–0తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. నాల్గవ మ్యాచ్‌లో తూర్పుగోదావరి, విశాఖపట్నం మధ్య జరగగా విశాఖపట్నం జట్టు 6–0 గోల్స్ తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్ చేరుకుంది.

- బాలికల విభాగంలో అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, కర్నూలు, కృష్ణ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, గుంటూరు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా, అనంతపురం, వెస్ట్ గోదావరి జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యమ్మ, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మొరార్జీ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకనాథ్, టోర్నమెంట్ అబ్జర్వర్ అనిల్ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్ క్రీడాకారులు పాల్గొన్నారు.

అడ్డుకుంటే.. అంతు చూస్తాం!



ఇసుక ట్రాక్టరును అడ్డుకుంటున్న నాగరాజు



నాగరాజును బెదిరిస్తున్న దృశ్యం

- జైభీం పార్టీ నేత నాగరాజుపై కూటమి నేతల దౌర్జన్యం
- ఇసుక అక్రమ రవాణా అడ్డుకోవడంతో ఘర్షణ

పరిగి: 'అనుమతులు చూపాల్సిన అవసరం మాకు లేదు. ఇది మా ప్రభుత్వం.. మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం. మమ్మల్ని ప్రశ్నించేందుకు నువ్వెవరు..అడ్డుకుంటే అంతుచూస్తాం జాగ్రత్త' అంటూ కూటమి పార్టీల నేతలు జైభీం పార్టీ నాయకుడు నాగరాజును బెదిరించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ రవాణా సాగుతోందని పలువురు స్థానికులు శనివారం జైభీం పార్టీ నేత నాగరాజుకు సమచారం ఇచ్చారు. దీంతో అతను వారితో కలిసి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ఊటుకూరు సమీపంలోని పెన్నానది వద్దకు వెళ్లారు. అప్పటికే ఇసుకను నింపుకుని వెళ్తున్న ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని అడ్డుకున్నారు. దీంతో ఇసుక తరలిస్తున్న వారు నాగరాజును బెదిరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా... ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇసుక సరఫరాకు అధికారులు ఇచ్చిన అనుమతులు చూపించాలని నాగరాజు కోరగా.. తమకు అలాంటి అవసరం లేదని వారు అధికార దర్పాన్ని ప్రదర్శించారు. కులం పేరుతో నాగరాజును దూషిస్తూ... అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరిస్తూ అక్కడి నుంచి ట్రాక్టర్లను తీసుకువెళ్లారు. దీనిపై నాగరాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు ఇలా అక్రమంగా ఇసుక తోలడం వల్ల తాగు, సాగు నీటికి సమస్యలు తలెత్తుతాయని, అందువల్లే తాము ఇసుక అక్రమ రవాణాను ఎట్టిపరిస్థితుల్లో సాగనివ్వబోమన్నారు.

నాకేం జరిగినా వారిదే బాధ్యత



నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుకను తరలించకుండా అడ్డుకుంటున్న నాపై మంత్రి సవిత, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచరులు దాడులకు తెగబడ్డారు. నాకేం జరిగినా కూటమి ప్రభుత్వ పెద్దలు, మంత్రి సవిత, ఎమ్మెల్యే బాలకృష్ణదే బాధ్యత. ఇసుక ఉచిత మంటూ చెబుతున్న కూటమి ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో ఆ పార్టీల నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేసే బాధ్యత లేదా?. ఈ విషయంపై తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేస్తా.


– ఊటుకూరు నాగరాజు, జైభీం పార్టీ నేత

వృద్ధుడి ఆత్మహత్య

చిలమత్తూరు: కోడూరుకు చెందిన గోరంట్ల రంగప్ప (65) శుక్రవారం రాత్రి థామస్ మన్రో తోపులోని జెడ్పీ హైస్కూలు వెనుక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రంగప్పకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య ఎనిమిదేళ్ల క్రితమే చనిపోయింది. ఒంటరిగా ఉంటున్న రంగప్ప అనారోగ్యంతో బాధపడుతూ బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- ఆటోను ఢీకొన్న కారు
- మహిళా కూలీ దుర్మరణం
- డ్రైవర్ సహా 15 మంది కూలీలకు గాయాలు



దస్తగిరమ్మ (ఫైల్)



గాయపడిన శివ, నబీరసూల్

యాడికి: వారంతా రెక్కాడితేగానీ డొక్కాడని వ్యవసాయ కూలీలు. శనివారం కూలి పని ముగించుకుని ఆటోలో బయల్దేరిన వారిని వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక కూలీ దుర్మరణం చెందగా.. మరో 15 మంది గాయపడ్డారు. ముందు వెళ్తున్న వాహనాన్ని కారు ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాడికి మండలం వేములపాడు కొట్టాలపల్లికి చెందిన గొల్ల శివకు చెందిన ఆటోలో గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు శనివారం వేకువజామునే పెద్దపప్పూరు మండలం యంగంపేటకు చెందిన ఓ రైతుకు వేరుశనగ పంటను తొలగించేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పని ముగించుకుని ఆటోలో తిరుగుపయనమయ్యారు. వేములపల్లి సమీపంలోకి చేరుకోగానే గుత్తి నుంచి తాడిపత్రి వైపు పోతున్న ఏపీ02ఏకే 3132 నంబరు గల కారు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా కూలీలతో వస్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జయ్యింది. అందులో ఉన్న వారంతా సమీపంలోని పొలాల్లోకి ఎగిరిపడ్డారు. డ్రైవర్ శివతో పాటు కూలీలు చిన్న రంగారెడ్డి, నబీ రసూల్, ప్రతాప్, కుళ్లాయప్ప, కుళ్లాయమ్మ, ఖాశింబీ, దస్తగిరమ్మ (50), ప్రతాప్, సుబ్బయ్య, రమణమ్మ, రంగమ్మ, రామచంద్రుడు, లక్ష్మి, కళావతి, పాండు భార్య లక్ష్మి, పాండు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న 108 వాహనాల ద్వారా క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన ఇద్దరికి వైద్యులు స్థానికంగా చికిత్సనందిస్తూ.. మిగిలిన 14 మందిని అనంతపురం ఆస్పత్రికి పంపించారు. చికిత్స పొందుతూ దస్తగిరమ్మ (50) మృతి చెందింది. ఈమెకు భర్త, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఆటో డ్రైవర్ శివతో పాటు నబీరసూల్, ప్రతాప్, కళావతి, చిన్న రంగారెడ్డి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రమాదంలో ఒకేసారి 15 మంది గాయపడటం, ఒకరు మృతి చెందడంతో వేములపాడు కొట్టాలపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పోస్ట్‌మేన్ ఆత్మహత్య



అంజినాయక్ మృతదేహం

సోమందేపల్లి: మండల కేంద్రం సోమందేపల్లిలో నివాసముంటున్న పోస్ట్‌మేన్ అంజినాయక్(48) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. అంజినాయక్ సుద్దగుంటపల్లిలో పోస్ట్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శనివారం నక్కలగుట్ట కాలనీ ప్రాంతంలో అంజినాయక్ మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలంలో పురుగులమందు డబ్బాను గుర్తించారు. మద్యానికి బానిస కావడంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగానే పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య సాకీబాయి గుడిబండ మండలంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

నిషేధిత మందులు విక్రయించొద్దు



దుకాణంలో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

కదిరి అర్బన్: పట్టణంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, లైసెన్సులను పరిశీలించారు. నిషేధిత మందుల విక్రయాలు జరపకూడదని నిర్వాహకులను ఆదేశించారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ లేకుండా చూడాలని వ్యవసాయాధికారి శ్రీనివాస రెడ్డిని సూచించారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



పీహెచ్‌సీలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

హిందూపురం: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ మంజువాణి ఆదేశించారు. చౌళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. కాన్పుల వార్డు, రోగుల వార్డు, ల్యాబ్‌ను క్షుణంగా పరిశీలించి.. సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం హాజరుపట్టిక, ఓపీ రిజిష్టర్, వైద్య, ఆరోగ్య సేవల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో రోగులకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు బీవీ చంద్రశేఖర్, శాంతకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నమో నారసింహా..



క్యూలో వేచి ఉన్న భక్తులు

కదిరి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు శనివారం పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

– కదిరి టౌన్



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వైఎస్ కుటుంబంపై బాబు వ్యాఖ్యలు అనైతికం

- ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ధ్వజం



ఉరవకొండ: వైఎస్ జగన్–షర్మిల ఆస్తి పంపకాలు వారి వ్యక్తిగతమని, అయితే వైఎస్ కుటుంబాన్ని లక్ష్యం చేసుకుని వ్యాఖ్యలు, రాజకీయాలు చేయడం అనైతికమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి కుటుంబంలోనూ ఆస్తి పంపకాలు, తగాదాలు ఉంటాయని, ఇందులో వేలు పెట్టి రాజకీయాలు చేయడానికి చంద్రబాబు సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. ఎన్నికల హామీలు నేటికీ నెరవేర్చకుండా వైఎస్ కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోవడం కచ్చితంగా డైవర్షన్ పాలిటిక్స్ చేయడమేనన్నారు. హెరిటేజ్ కంపెనీలో మీ తోబుట్టువుకు ఎంత వాటా ఇచ్చారో సమాధానం చెప్పే దమ్ముందా అని చంద్రబాబును ప్రశ్నించారు. అనవసర విషయాలు పక్కనపెట్టి పాలనపై దృష్టి సారిస్తే బాగుంటుందని హితవు పలికారు.